సులతానీ!

వేలూరి శివరామశాస్త్రిగారు

౧

'సులతానీ!'

ఈపిలుపు ముగియకముందే సులతానీ పెదవులమీఁద చిఱునవ్వు పంచదార వలెను, లలాటమున బొమముడి అలచందపూవు వలెను కానిపించెను. తనను ఇటులు పిలిచిన శాంతయ్య కడకు వచ్చి అది 'నీభాంఛను; నీ కాల్ మొక్త*, అసలు పేరున పిలవండి బాబయ్యా!' అన్నది.

అది యిటులు వేఁడుకొనఁగా శాంతయ్య కొంత శాంతస్వరముతో 'నీ అసలు పేరు లోకు లందఱూ మఱచిపోయారు సరేకాని, ఇవ్వేళ అదోమోస్తరుగా ఉన్నావు, చంకలో ఆరైక ఏమిటి? బుజంమీఁద ఆ చీరేమిటి? ఏదో జరిగినటు లుంది' అని తేఱి పాఱఁజూచెను.

దాని చేతిమీఁద కపోలముల మీఁద ఎఱ్ఱని కదుములు, లలాటము మీఁద మంకెన పూవు అతికించినటులు నెత్తురు, చూచిన శాంతయ్య కనులనిండ నీరు.

ఇంటిలోనుండి శాంత వచ్చి చూచి 'ఏమిటో రగడ జరిగింది. చెప్పవే' అనెను.

సులతానీ గిరుక్కున వెనుదిరిగి 'అమ్మా! నేను మీయింటిలో ఉండిపోతా' అని అన్నది.

ఆలాగే ఉండు మంచిది అని శాంత అన్నది.

ఈ సమాధానము వినిపించుకొనకయే సులతానీ తాను అంట్లుతోము మావిమొక్క క్రిందికి వెళ్లి చంకలోని రైకయు బుజముమీఁది కోకయు మావిపంగటిలోఁ బెట్టి కూర్చుండి అంట్లు తోమ మొదలిడెను.

శాంత లోలోపలనే నవ్వుకొనుచు 'మాఱుమనుములో మాయ కామోసు' నను కొనుచు లోనికి వెళ్లిపోయెను. శాంతయ్యయు మామిళ్ల క్రింద అల్లపు మళ్లలో కలుపు తీసికొనుచుఁ గూరుచుండెను.

సులతానీ అంట్లుతోమి ఇల్లలికి తుడిచి శుభ్రము చేసెను. ఇతరుల పనిగూడఁ గొంత చేసెను. ముంగిటికి వచ్చి కూర్చుండెను.

ఏమియు తోఁచనినాఁడు ఊరక కూరుచుండినను తోఁచదు.

సెలవు పుచ్చికొనవచ్చిన పాలేరు పోతఁడు ఊరక కూరుచున్న సులతానీని చూచి 'నీవు ఇక్కడే ఉండిపోతావా ఏమిటి? ఇంటికి వెళ్లవూ?' అన్నాఁడు.

సులతానీ మాటాడలేదు. పోతఁడు ఎదుటికి వచ్చి సులతానీని చూచెను. ప్రతిదినము కౌతుకముతోఁ జూడఁబడు ముఖము కాదు ఆనాఁటి ముఖము. సులతానీ చూపు నెదుట

* 'నీ బానిసను; నీకాలు మొక్కుతా.'

వాఁడు ఆఁగఁజాలకపోయెను. వెనుకకు మరలెను. కొంచెము దాపున నిలిచి 'ఇవ్వేళ సులతానును వదిలిపెట్టేస్తావా ఏమిటి?' అనెను.

సులతానీ మాటాడలేదు.

మామిళ్ల క్రింద చప్పుడాయెను. పోతఁడు ఉలికిపడి చూచుచుండఁగా శాంతయ్య ముంగిటికి వచ్చెను.

పసుల పాకలోనుండి వీరఁడు మెల్లగా వచ్చెను.

'సరే మీరు అన్నాలకు పోయిరండి' అని శాంతయ్య అనఁగా పాలేళ్లిరువురును ఇండ్లకు వెళ్లిరి.

శాంతయ్య లోని కేఁగఁగనే శాంత 'దీనిని మీరు మన ఇంట్లో ఉండనియ్యొద్దు' అనెను. మొగము చిట్లించుకొని శాంతయ్య 'నన్ను ఉండనియ్యొద్దని నీవు ఉండనియ్యడానికా?' అనెను. శాంత 'అదేమి? నేనూ ఉండనియ్యను' అని అనెను.

లోపలి పలుకులు ఆలకించుటకు చెవులు దోయిలించుకొని కూరుచున్నది సులతానీ.

వెనుకనుండి పిల్లులు పట్టువానివలె సులతాను వచ్చెను. ఇలు వాకిండ్లు పరికించి చూచెను. సులతానీ ముందు వ్రాలెను.

సులతానీ రెండడుగులు వెనుకకు జరిగి కూరుచుండెను.

'నాదిబుద్ధితక్కువఅయింది; నన్ను కూడా రెండుకొట్టు' అని సులతాను మేనువంచెను.

సులతానీ మెడవాల్చి కూరుచుండెను.

'నాకు చిన్నతనం తేకు. బాబుగారితో చెప్పకు. ఆలోచించి వెంటనే నా మాట పాటించు. లే ఇఁక లే. బాబుగారు చూస్తే బాగుండదు.' అని సులతాను అనెను.

సులతానీ మెడ ఓరఁబెట్టెను. నల్లకలువలకు మెల్లకనులు పెట్టు సులతాను కాటుక కనులు సులతానీ కనులలోఁబడెను. సులతానీ కనులు మెలమెల్లగా ముకుళించుకొనిపోయెను. ఒక రెప్పపాటులో సులతానీ కనులు తెఱచెను. సులతాను లేచి దాని ముందు విచిత్రముగా నాట్యము చేసెను. గవాక్షమునుండి శాంతకును శాంతయ్యకును ఆనాట్యము కానిపించుచుండెను.

సులతానీ లేచెను.

సులతాను మామిడి మొక్క క్రిందికిపోయి చీరను రైకను తీసికొనివచ్చెను. 'రా పోదాం' అనెను.

'పద! నీవు ముందర పద! ఇఁక నోరెత్తకు!' అని సులతానీ దారికేసి చేయి చూపెను.

కిక్కురుమనక సులతాను పోయి పెండెము కడ నిలువఁబడి చూచుచుండెను.

లోపలినుండి శాంత వచ్చెను. 'అమ్మా! ఇంటికి పోతాను సెలవియ్యండి' అని సులతానీ అనెను.

'అదేమే మేఁకల జగడ మయింది?' అని శాంత యనెను.

'అమ్మా, ఏమీ లేదు. ఇంటికి పోతాను' అని ప్రత్యుత్తరము అపేక్షింపక సులతానీ వెళ్లిపోయెను.

౨

చుట్టును ఎఱుకల గుడిసెలు, దొమ్మర గుడిసెలు; చాకలిపేట, మంగల గూడెము. నడుమ పెద్ద గంగానమ్మ — వేఁపచెట్టు. దాని క్రిందనే సులతానీ గుడిసె.

సూర్యుఁడు అస్తమింపఁబోవ నున్నాఁడు. ఎఱుకతలు పిల్లలకు సోదె పాఠములు చెప్పచుండిరి. దొమ్మర సానులు పదములు పాడుచుండిరి. శుద్ధిదేవతలు చాకితలు మడతలు పుచ్చుకొని గ్రామములోనికిఁ జనుచుండిరి వరాహావతారములు, వీరభద్రవాహనములు రాకపోకలు చేయుచుండెను.

సులతాను వేఁపచెట్టుక్రిందఁ బ్రేఁపచువ్వలతో బుట్టలల్లుచుఁ గూరుచుండెను. దాపుననే కూరుచుండి గురువు చింతయ్య సిద్ధప్ప ద్విపదలు పాడుచు తన్మయత్వము చెందుచుండఁగా సులతానీ ఆలకించుచుండెను. శివల మల్లయ్య, సాలె శ్రీరాములు, మంగల మంగి, చాకల పుల్లి, ఎఱుకల మస్తాను, వీరందఱును శ్రోతలు. రాత్రివేళ మబ్బులమీఁది నగలు నక్షత్రముల నన్నిటిని తన పురిమీఁదనే మోచి ఒకనెమలి సులతానీముందు నాట్యము చేయుచుండెను.

సులతాను సులతానీతో రాజీపడిన తరువాత కల్లు త్రాగి పండువుచేసికొనెను. ఆ పండుగులోనే బుట్టలల్లుచు కూరుచుండఁగా చాకల సుబ్బఁడు వచ్చి "రాత్రి పొద్దుపోయిందాఁకా యీరిరేవులో బట్టలుఉతుకుతూందిట" అనియు, మంగల శోభనాచలము 'శ్రీరాములు ఈఊరునుంచి లేచిపోతాట్ట; వాఁడికి శాస్తి చేయకుండా వెళ్లనియ్యఁగూడ' దనియు-ఇటులే పలువురు పుఁబతగవులు చెప్పకొనిరి. సులతాను రాజీలు డిక్రీలు ఇచ్చి అందఱను పంపివైచెను.

గురువు చింతయ్య మాధుకరమునకు లేచెను. ఎవరిదారిని వారు వెడలిపోయిరి.

సులతానుచూపులు పిఱుఁదులకు తాఁకుచుండఁగా బుజముమీఁద కడవతో సులతానీ చెఱువునకుఁ బోయెను.

చీపురుకట్టతో శుభ్రముగా ఊడ్చినటులు ఉన్న ఒకసందునుండి వచ్చి మొగలో ఎలిచి సులతానుఅక్క తొంగితొంగి చూచు చుండెను. సులతాను దానిని చూచి 'బోగీ! రా!' అనెను. బోగి గుడిసెలోనికి పోయి నాలుగు మూలలు చూచి వెలికి వచ్చెను. సులతాను కూర్చుండు మని వేఁపచదరు వైచెను. బోగి కూర్చుండెను.

'నీ డబ్బంతా సులతానీ మాయం చేస్తూంది. నీకు తెలియడం లేదు.'

'చీ చీ! అబద్ధం. ఎవఁడు చెప్పాఁడే నీకు?

'శాంతయ్యగారిదగ్గఱ పదికాసులు దాఁచిందిట. ఆసంగతి శాంతయ్యగారు మునసబుగారితో చెప్పతుంటే మీ బావ విన్నాఁడు.'

'నిజం?'

'నిజం;'

'ఆలా అయితే సంకురుమయ్యపండుగు నాఁడు బావతో జూదం ఆడానన్న మాటే. నీ కోకాసు ఇచ్చా నన్నమాటే.'

'ఆ అన్నీ యిచ్చావు. నిన్నటి అయిదు రూపాయలలో నా కేమయినా అంద నిచ్చింవ్?'

'ఈ తేప అల్లా కాదు. నీకు కాసియ్యకపోతే నేను నీతమ్ముణ్ణి కాదు.'

'చేతిలో చెయ్యి వెయ్!'

సులతాను బోగి చేతిలో చెయి వేయఁ బోయి కొంచెము తూలిపడెను. పిదప లేచి 'ఇదిగో ఇదిగో ఇది చెఱువునుంచి వచ్చే వేళ అయింది. నీవు మెల్లగా వెళ్లు! పోనీ కూచో! పోనీ వెళ్లు! పోనీ ఈ!' అనెను.

బోగి లేవఁబోవుచుండఁగా సులతానీ అడుగుబెట్టెను. రుసరుస లాడుచు దాపునకు వచ్చి 'రా వద్దంటే నీ విక్కడికి ఎందుకు వచ్చావ్?' అనెను.

'పోనీ రానులే' అని బోగి పోఁబోయెను. సులతాను కొంచెము గుక్క తిప్పుకొని 'వస్తే యేం? రాకూడదా?' అనెను.

'రాకూడదు ముమ్మాటికి రాకూడదు.'

'వస్తుంది ముమ్మాటికి వస్తుంది.'

'వస్తే నీ గుడిసెకు నిప్పెట్టి లేచిపోతా. బాబయ్యగారు నాకు కూడూ గుడ్డా ఇస్తామన్నారు తెలిసిందా? అది ఇక్కడికి వస్తుందా? మానుతుందా? చెప్పు. వస్తే ఈకుండ ఇక్కడే పగలేసి ఈదారినే బాబుగారింటికి పోతా. ఏ మాటా చెప్పు.'

సులతాను ముఖము జేగురుగడ్డ.

'మహా వారింట్లోనే ఉంటానంటావు. ఏ మాత్రం తిండి పెడతారో చూదాం. పో లేచి పో!'

'నా వెళటంమాట అటుంచు! బోగి ఇక్కడికి రాకతప్పదా? నాడబ్బంతా నాకుఁ గాకుండా నీకుఁ గాకుండా తప్పదా?'

'మన ఇద్దఱికీగాదు, బోగికీ గాదు. శాంతయ్యగారికి కాక తప్పదు. నీవు ఆయనకుఁ గాక తప్పదు.'

'ఛీ ఛీ. బాబయ్యగారివద్ద డబ్బు ఉంచుకుంటే కడుపులో ఉంచుకున్నట్లే.'

'అయితే ఎంత ఉంచావు.'

'ఎంతో కొంత. నేను లేచి వచ్చేటప్పుడు నాపాఁతమగఁడు ఇచ్చాఁడు నా కాడబ్బు. దాన్ని గుఱించి నీవు అడుగవలసినపనిలేదు.'

'వాఁడు వట్టి వెధవ. వాఁడిపేరు నాదగ్గిఱ చెప్పకు. నీవు నాదగ్గిఱకు ఎప్పుడు వచ్చావో అప్పుడే అది నాడబ్బు. నాడబ్బు నాకు తెచ్చిపెట్టు, ఇయ్యి!'

'ఇయ్యను ఇయ్యను ఇయ్యను.'

సులతాను అల్లుచున్న బుట్ట నావలఁ బాఱవైచి ఒక నిడుదచువ్వతో సులతానీని వేసెను. చువ్వ పొడుగునను తోలు లేచెను. మూపుమీఁది కడవ లక్ష చిల్లపెంకులై నేల నావరించెను. సులతానీ నేలవాలెను.

'దొంగవేసం' అని భోగి మెల్లగా ననెను.

'వేసాలూ గీసాలూ నాదగ్గిఱా?' అని సుల తాను సులతానీని ఎడపెడఁ గొట్టెను. రాతి కేని దెలియుఁగాని సులతానీకి తెలియదు.

భోగి మెల్లగా జాఱెను. సులతాను సులతానీని కదిలించి తెల్లఁబోయెను.

నలుగురును చేరిరి. తలాయొక మాట అనిరి. సులతాను గబగబ గుడిసెలోనికిఁ బరు గెత్తి మంచముక్రింద దాఁగుకొనెను.

పదిమంది చూచుచుండిరిగాని వారి కేమి చేయను తోఁచలేదు.

సులతానీ మొదటి మగఁడు పరమానం దాయియు ఆగుంపులో నుండెను. ఒక ముంత తో నీరుతెచ్చి దానినోటఁ బోసెను. చెమట తుడిచి బట్టతో విసరుచు కూరుచుండెను. 'వెళ్లి పొం'డని అందఱను అనుశాసించెను.

క్రమక్రమముగా ఒకరొకరే వెళ్లిపోయిరి. లోపల దాఁగియున్న సులతాను గీఁతకత్తితో తొంగితొంగి చూచుచుండెను.

కొంత సేపటికి సులతానీ మోమెత్తెను. ఎదుట పాఁతమగఁడు పరమానందాయి.

'ఛీఛీ, లేచిపో! ఊ! వెంటనే లేచి పో! చస్తావు పో' అని సులతానీ అనెను. అని వెను కకు విఱుచుకొని పడిపోయెను.

మునసబుకరణములు వచ్చిరి. సులతా నును పట్టుకొనిపోయి బండకొయ్యవైచిరి.

3

శాంతయ్య మోసాలముందు సులతానీ తనను తాను మొదట తెలిసికొనెను. తన మీఁదనున్న మ్రిఁకొమ్మలు విసరుకర్ర చేయు పనిని చేయుచుండెను. ఏఁటిరింతలు బాలసూ ర్యునకు బాకా లూఁదుచుండెను. వడ్రంగి పిట్టలు ఎఱ్ఱతలపాగలు పెట్టుకొనిన పోలీసుల వలె చెట్టు పైకొమ్మలనుండి చూచుచుండెను.

సులతానీ మ్రిఁయూడ పట్టుకొని లేచి కూరుచుండెను. శాంతయ్య ఎదురుగా వచ్చెను.

'బాబయ్యా! మీకు దణ్ణం. మీరే నాకు తండ్రి మీరే నాకు తల్లి' అని సులతానీ లేచి శాంతయ్యకు జేజే పెట్టెను. శాంతయ్య మో మును అటు తిప్పుకొనెను. సులతానీ గుమ్మము కడకు వచ్చి 'అమ్మా! అంట్లు వెయ్యండి! తొలిచి మఱి పోతాను' అనెను.

శాంత లోపలినుండి వచ్చి నివ్వెఱపోయి 'ఈ రాత్రెల్లా స్మారకం లేదు, ఒళ్లంతా కదు ములు కట్టిపోయింది. ఇప్పుడే పని చేయడా నికి నీకు సత్తువ ఎక్కడినుండి ఊరిందే?' అనెను.

'చేయకపోతే ఎల్లాగమ్మా!'

'ఇవ్వేళ నేనే చేసుకుంటాను గాని పాలే రును తీసుకొని నీవు ఇంటికి వెళ్లు!'

'నేనే పాలేళ్లను ఇంటికి పంపఁగలను, కాని అంట్లు వెయ్యండి తోలుస్తాను.'

శాంత ఏమనుకొనెనో ముఖము ముడి కటించుకొని అంట్లు పడవైచి లోనికి వెళ్లి

పోయెను. సులతానీ అంట్లన్నియు తీసికొని మామిడిమొక్క క్రిందికి వెళ్ళి కూరుచుండెను. లోఁగడ కుండలో జాగ్రత్తపెట్టుకొనిన నీటిలో గిన్నెలు తోలుచుచుఁ దోలుచుచు 'అబ్బ' అనుకొనెను. చేతినుండి గిన్నె జారెను. తల గిర్రున తిరిగెను. మావి మొక్క కానుకొనెను.

కొంత సేపటికి ఒడలెల్ల పరికించి చూచుకొనెను. కనుల వెంట నీరోడఁదొడఁగెను. అతి ప్రయత్నమున వెక్కు లాఁపుకొనెను. శాంతయ్య ముంగిటికి రాఁగనే గిన్నెలు చేతఁబుచ్చికొని సులతానీ ఎదురుగా వచ్చెను. దాని పచ్చనిశరీరముమీఁద చబుకు దెబ్బలు శాంతయ్యకు కానిపించెను. శాంతయ్య కనుల నీరు గ్రమ్మెను. సులతానీ కనులును నీటఁదోఁగెను. ఒకరొకరు మాటాడకుండ కొంచెము సేపు అటులు నిలువఁబడియుండిరి.

'సులతానీ! నిన్ను మా అమ్మలాగా పోషిస్తా. మాయింట్లో ఉండిపో! కూడూ గుడ్డా ఇస్తాను. భగవంతుణ్ణి తలఁచుకుంటూ కాలం గడుపు!' అని శాంతయ్య అనెను.

'అయ్యా! దేముఁ డింకా నా తలలోకి దిగలేదు. నాకు సులతానే దేవుఁడు. కాని తమరిని ఒకటి వేఁడతాను' అని సులతానీ అనెను.

శాంతయ్య ఈమాటలతో కొంత విరక్తి కొంతరక్తి చెంది 'ఏమిటా వేఁడుకోవడం?' అని అన్నాఁడు.

'మీవద్ద నేను దాఁచికొన్న సొమ్ము నేను చచ్చినాసరే సులతానుకు ఇవ్వద్దు; ఇది ఒకటే నాకోరిక' అని సులతానీ అనెను.

శాంతయ్య మాటాడకుండెను. శాంత వచ్చి 'మీదగ్గిఱ ఆ కాసులు ఉంచద్దు; దానికే ఇచ్చివేయండి! సులతానే దీనికి దేవుఁడైనపుడు ఈకాసులు ఆ దేవుఁడికే నివేదన చెయ్యాలిసి వుంటుంది. మీదగ్గిఱ ఉంటే, ఆ డబ్బుకోసం కూనీలు అయిపోతవి. మీకూ మాట వస్తుంది' అనెను.

సులతానీ శాంతను ఆచి చూచెను. పిదప శాంతయ్యకేసి తిరిగి 'అయ్యా! అలాగైతే ఆ బాధ నేనే పడాలి; నాకే ఇచ్చి వెయ్యండి' అనెను.

'సరే, ఆలోచించి మళ్లీ చెప్పు! ఇచ్చి వేస్తాను.' అన్నాఁడు శాంతయ్య.

సులతానీ గిన్నె లన్నియు వాసివాని తావులలోఁ బెట్టి ఇంటిపని మెల్లయు మెల్లగాఁ జేసి శాంతయ్యకడకు వచ్చి 'బాబూ! నే నిఁక మీపాదాలకడనే ఉండిపోతాను' అని అనెను.

'సులతానును వదిలేస్తావా?'

'వదిలేస్తా.'

'భేష్. అలాగే ఉండిపో! ఇఁక నీకు శ్రీరామరక్ష' అని శాంతయ్య అనుచుండఁగా శాంత వచ్చి నీదేవుణ్ణి రాత్రిచూచి కొందువు గాని ఈపూఁట ఇక్కడే అన్నం తిని పొద్దూకిం దాఁకా ఉండు!' అన్నది. సులతానీ జేజే పెట్టి 'సరే నమ్మా!' అన్నది.

ప్రొద్దు గ్రుంకుచుండఁగా మునసబు కడ నుండి తలారి శాంతయ్యకడకు వచ్చెను.

వచ్చుచు వచ్చుచునే తలారి — 'ధొర గారూ! సులతానుగాఁడు చంక కింద కత్తి దాఁచుకున్నాఁడు. రాత్రిరి ఎవరికీ కనబడలే పొద్దున్నే కనఁబడింది. మీకు కాస్త ఊకబుగ చెప్పి తీసుకో రమ్మన్నారు.'

ఈమాటలు వినుచు శాంతయ్య సుల తానీ మోమును జూచెను. ఆముఖమునఁగాని ఆకనులఁగాని ఇసుమంతేని భేదము కానుపింప లేదు.

'సరే వస్తున్నాను పద' అని శాంతయ్య అనెను. ఇటులు అని వెంటనే కర్ర దీసికొని తలారి ముందు నడుచుచుండఁగా శాంతయ్య కచేరీచావడిలోనికిఁ జనెను ఎదురుగా బండ కొయ్యలో సులతాన్. వానిని జూచుచు వాని ప్రక్కనే పరమానందాయి. వాని ప్రక్కనే ముసికోల పుచ్చికొని గ్రుడ్డిగురవాయి.

౪

గ్రామమున నేదేని విశేషము జరుగుఁ గాక అది అందఱకును వలయును — "అనా హూతోఽ ధ్వరం గచ్ఛేత్."

ముందర ఒక ఎల్లయ్యయు పిదప నొక పుల్లయ్యయు వచ్చి దూరముగా నిలువఁబడి చూచిరి. పిదప నొక ఎల్లమ్మ పిమ్మట నొక పుల్లమ్మ. తరువాత తట్టాయ బుట్టాయ కట్టాయ కంపాయ. పిమ్మట మేఁకలు గొర్రెలు ఆవులు బఱ్ఱెలు— ఇది యెల్లయు నొక మహాసభ. రమ్మనువాఁడు లేఁడు; పొమ్మనువాఁడును లేఁడు—స్వరాజ్యము. అచటి స్థలము సార్వ జనికము, కాలము సార్వజనికము. కొంతగుండా రాజ్యము—ఒకఁడు 'కొట్టు' అనుచో రెండవ వాఁడు ఆ'కొట్టు'తో ఆఁగక 'పొడు' అనియు చేర్చును. దానితో తేనెపెర కదిలినటులు అందఱును 'కొట్టుకొట్టు, పొడుపొడు!', 'పాపం' అని ఒకఁడనుచో రెండవవాఁడును 'అయ్యో పాపం! వదిలెయ్యండి, వదిలెయ్యండి'. అంద ఱును కలిసి 'వదిలెయ్యండి వదిలెయ్యండి వది లెయ్యండి వదిలెయ్యండి.'

సూర్యుఁడీ మహాసభ నుండి ఎవరికిని దెలియకుండ తప్పుకొనెను. అది పిఱికితనమో మంచితనమో యెవరికిఁ దెలియును? చీకటి జడవలె అల్లుకొనియెను.

మునసబుగారు లేచి అందఱను చూచి వీఁడు సులతానీని కొట్టాఁడు కాఁబట్టి, వీఁడి కిన్నీ అదే శిక్ష. 'ఒరే గుడ్డిగురవా! వీణ్ణి గది లోకి తీసకపోయి తడికె మూసి ఇరవై దెబ్బలు కొట్టు! కళ్లు కనఁబడక గోడలను కొట్టేవు సుమీ' అని అన్నారు.

గురవాయి లేచి గ్రుడ్లుత్రిప్పుచు మునికోల సవరించుచు—'ధొరగారూ! అంధఱికీ మొహం మీఁద కళ్లుంటే గురవాయికి చేతులమీఁద ఉన్నాయి' అని అనెను.

పరమానందాయియు బ్రహ్మానందాయి యు సులతానును బండకొయ్యనుండి తీసి గది లోనికి తీసికొని వెళ్లిరి.

చూడవచ్చిన మహాజను లందఱు 'సరియయిన శాస్తి అయిన'దనిరి. కొందఱు వెళ్లి పోఁదొడఁగిరి. జంతుజాలము కొంత అటు కొంత ఇటు, ఓహరిసాహరి ఆయెను. పిల్లలు నలిగిపోవుచుండఁగా పెద్దలు రెక్కలు పట్టుకొని ఆవలికి ఈడ్చుచుండిరి. గలభా ఎక్కువ ఆయెను.

ఆ గందరగోళములో ఎవరికిని తెలియకుండ దూఱివచ్చి తడికె మెల్లగా తొలఁగించి సులతానీ గదిలో ప్రవేశించెను. సులతానీని చూచి సులతాను ఆవురుమనెను

'కొట్టినప్పుడిల్లా లేదేం?' అని గురవాయ అనెను.

సులతానీ తన కుడి అఱచేయి పైకెత్తి ఎడమచేతి చూపుడువేలు పెదవులమీఁద నిలువుగా వేసికొనెను. గ్రుడ్లుఱిమెను.

సులతాను తెలిసికొని కిక్కురు మనకుండెను. 'చేయి చాఁపు!' అని గురవాయి గద్దరించెను.

సులతానును ఒకమూలకు త్రోసి సులతానీ కుడిచేయి చాఁపి ఎడమచేతి వేలితో సులతానును పొడిచెను. తెలిసికొని 'చాఁపాను' అని సులతాను అనెను.

'ఏదీ?' అన్ని గురవాయి పట్టుకొన వచ్చెను. వెంటనే సులతానీ సులతాను చేయి అందిచ్చెను. గురవాయి తడవి చూచుకొనెను. సరిగా వెనుకకు నడచెను. చేయెత్తి దైవమునకు మ్రొక్కుకొనెను.

వెంటనే సులతానును మూలకు త్రోసి వైచి సులతానీ తనచేయి చాఁపెను.

సులతానీ చేతిమీఁద దెబ్బలు పళపళ మోఁగెను. ఆ చేతినుండి రక్తమే జాఱెనో, రాగిమే జాఱెనో ఆచీకటిలో ఎవరుచూచిరి? దాపులనున్న సులతాను చూచెనా ?

గురవాయి తన పని ముగించుకొని తడికె తెఱచెను. సులతానీ సులతానును ముందులకు త్రోసెను. గురవాయి ముందు నడవఁగా సులతాను వెనుక వెళ్లెను.

'ఎవళ్ల యింటికి వాళ్లు వెళ్లి పొండి!' అని మునసబుగా రనిరి.

తుమ్మెదలవలె సంగీతములు తీసికొనుచు ఎక్కడివా రక్కడికి పోఁదొడఁగిరి. సులతాను తడికెకేసి చూచుచు ముందు ముందులకు నడచెను వాని వెనుకనే శాంతయ్య.

సులతాను వెనుక వెనుక చూచుచునే నడచుచుండెను. 'మఱెవరూ కాదు నేనేరా' అని శాంతయ్య అనెను. సులతాను ఏడుపు నాఁపుకొనలేకపోయెను. వెకవెక్క మొదలిడెను.

'పాపం! దెబ్బలు బాగా తగిలినవి కాఁబోలు' అని శాంతయ్య అనెను.

'కాదండి బాబూ! ఆ దెబ్బలు తిన్నది సులతానీ' అని సులతాను వెక్కి-వెక్కి-యేడ్వ దొడఁగెను.

శాంతయ్య నిర్ఘాంత పోయెను. జరిగిన సంగతి యంతయు సులతాను చెప్పెను. శాం

తయ్య ముక్కుమీఁద వేలువైచికొని నిలువఁబడెను.

శాంతయ్య కొంతసేపటికి 'వెంటనే సులతానీని ఇక్కడికి తీసుకోరా!' అనెను.

సులతాను వెనుకకు కాలు పెట్టుటకు కొంత తచ్చాడెను. శాంతయ్యకు విరక్తి కలిగెను. 'నేనేవెళ్లి తీసుకవస్తాను' అనిశాంతయ్య **అనెను.**

మొగసాలనుండి ఈప్రసంగము నంతయు వినుచున్న శాంత ఎలుఁగెత్తి--'సులతానీ ఇక్కడికి వచ్చింది, రండి' అన్నది. శాంతయ్య గబగబ లోనికేఁగెను. వెనుకనే సులతాను. వాని వెనుకనే మెలమెల్లగా పరమానందాయి.

౫

వాకిట వ్రేలాడుచున్న దీపముముందు సులతానీ నిలువఁబడి యుండెను. దీపములోనున్న జడతేజస్సును ఒకతూరి, సులతానీముఖములోనున్న చేతనతేజస్సును ఒకతూరి, శాంతయ్య రెండుమూఁడుసారులు చూచెను.

సులతానీ తనచేతిని వస్త్రములో దాఁచికొనెను.

ముందుకు మెలమెల్లగా అడుగులు వేసికొనుచువచ్చి సులతాను నిలువఁబడెను. వాని వెనుక పరమానందాయి.

'చూచితివా నేఁటి తమాషా? చెప్పిందా నీకు సులతానీ?' అని శాంతయ్య శాంతతో అనెను.

'ఆ, దాని దేవుణ్ణి సులతానును తన్నించిందని మీరు కూడా సంతోషించాలి' **అని** శాంత యనెను.

'పనికిమాలినదానా! నీకెప్పుడూ తొందరే! ఇవ్వేళ వాఁడికి బదులుగా ఈ దెబ్బలు తిన్నదికూడా సులతానీయే' అని శాంతయ్య **అనెను.**

శాంత కనులు రెండును ఏకాగ్రములాయెను.

సులతానీ వెనుదిరిగి చూచెను—దూరముగా నిలువఁబడి యున్నారు సులతానును పరమానందాయియు. సులతానీ ముఖమును మరల ముందుఁకు త్రిప్పుకొనెను. దాని ముఖమున మార్పేమియు లేదు.

ఇంతలో ప్రకృతికి వచ్చి 'శాంత అదియేమిటి?' అనెను.

'సులతానీ! ముసుగునుండి నీచేయి తీసి చూపు' అని శాంతయ్య అనెను.

సులతానీ చూపలేదు.

'సులతానీ! నీలో ఒకతేజస్సు ఉన్నదని నాకు మొదటినుంచీ తెలుసు. కర్మ చాలక ఇక్కడ పడ్డావు. నీవిఁక మాఇంటివద్ద ఉండిపో. నిన్ను మాఅమ్మలాగా చూచుకొంటాను. భగవంతుణ్ణి తలఁచుకుంటూ కాలం గడుపు!' అని శాంతయ్య అనెను.

శాంత చేరువకువచ్చి 'సులతానీ! చేయేది చూపు, చూపు!' అనెను.

సులతానీ ఏమి యోజించుకొనుచుండెనో శాంత మాటలుగాని శాంతయ్య మాటలుగాని వినలేదు. అపుడు తలయెత్తి చూడఁగా తన యెదుట శాంతయు శాంతయ్యయు నుండిరి. అది వెంటనే వారి యిరువురికి సాష్టాంగనమస్కారము చేసెను. దాని చేతినుండి రక్తము స్రవించుచుండెను.

సులతానీ సొమ్మ దోఁగెను.

శాంతయ్య నీరుతెచ్చి ముగము మీఁద కొట్టి చేతికి కట్టుకట్టెను. శాంత విసరుచు నిలువఁబడెను.

సులతాను దగ్గఱకు వచ్చి—'అమ్మా, మీరు విసరఁగూడదు, నేను విసురుతాను' అని అడ్డము వచ్చెను.

'అంట్లవెధవా! మళ్లా దెబ్బలు కొట్టించడానికి నడుమ చేరావా?' అని పరమానందాయి దగ్గఱకు వచ్చెను.

సులతాను గ్రుడ్లుఱిమెను. పరమానందాయి పండ్లు పటపట గొఱికెను

సులతానీ లేచెను. చూపుడువేలితో వారిరువురిని బెదిరించెను. ఇరువురును ఎడముగా నిలువఁబడిరి.

సులతానీ శాంతయ్యనుఁజూచి 'అయ్యా! నా దోమనవి' అనెను.

'ఏమిటి?'

'తమ వద్ద నా కాసు లిపుడు సిద్ధంగా ఉన్నవా?'

'ఉన్నవి.'

'పరమానందయ్యవద్ద నేనుండఁగా కూలీనాలీ చేసి సంపాయించాను. అవి ఆయనవి. ఆయనకు ఇయ్యండి బాబూ!'

'మంచిది.'

'నేను తమ యింట్లో ఉంటే తమకూ బరువే అవుతుంది, నాకూ బరువే అవుతుంది. ఈమాట సత్తెం.'

'కాదు' అని శాంత అన్నది.

సులతానీ శాంతమాట వినిపించికొనలేదు. శాంతయ్యను చూచుచు, 'అయ్యా, దేవుఁ డింకా నాతలలోకి దిగలేదని పొద్దున తమతో అన్నాను. ఇందాఁక దెబ్బలకుముందు నాతలలోకి దిగాఁడు.'

శాంతయ్య పెదవులపై చిఱునవ్వు కానిపించెను. శాంత తెల్లపోయి చూచుచుండెను. సులతానును పరమానందాయియు ఱిచ్చపడిరి.

'ప్రాణాలయినా ఇచ్చే నేస్తం నాది. మళ్లా నాకు మళ్లే ప్రాణాలిచ్చే నేస్తం నాకు దొరకలేదు. ఇఁక అక్ఖర్లేదు.'

సులతానును పరమానందాయియు తలలు వంచుకొని నిలువఁబడిరి

'బాబూ! నేస్తంలో చేఁదు విఱిచి తీపి సంపాయించాలి. నేను తమకూ బరువు మోపను. నేనూ బరువు మోయను. బిచ్చ మెత్తుకొనే బికారినయి పోతా. తిరుపతి వేంకటేశ్వర్ల దాసరి నవుతా. నా కిఁక వెయ్యి నామములవాఁడితోనే నేస్తం. నాకు మీరందఱూ సెల విప్పించండి.'